# రాగ, భయ, క్రోధములుండినంతవరకు దివ్యత్వము అర్థము కాదు

ప్రేమస్వరూపులారా!

సర్వత్రా ఏకత్వంగా వ్రాకిన గ్రంథము భగవద్గీత. గీతను తెలియని మానవులు చాలా అరుదు. భారతీయులేకాక పాశ్చాత్యులుకూడా గీతను వర్ణిస్తూ, పఠిస్తూ, ఆచరిస్తూ, ఆనందిస్తూ ఉన్నారు. ఈ గీతయందు మొదలు, చివర చక్కగా గుర్తించినప్పుడు ఒక వ్యక్తికిగానీ, ఒక జాతికిగానీ లేక ఒక దేశమునకుగానీ లేక ఒక సమాజమునకుగానీ, ఒక మతమునకుకాని సంబంధించినది కాదు అని స్పష్టము చేస్తూ వచ్చింది. దేశకాలపాత్రలకు అతీతమైన తత్త్వాన్ని ప్రబోధిస్తూ వచ్చింది. ఇందులో ప్రధానమైన మొదటి శ్లోకమందు ధర్మమును నిరూపించి, కట్టకడపటి శ్లోకమునందు జయమును చేకూరుస్తూ వచ్చింది.

**యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః,**
**తత్ర శ్రీ ర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ.**

మొదట ధర్మము, కడపటికి విజయము. విజయము ఎక్కడ చేకూరుతుంది? ధర్మమును ఆచరించినప్పుడే విజయము చేకూరుతుంది. ఇట్టి సత్యమును చక్కగా ప్రబోధిస్తూ వచ్చింది. ఇట్టి ధర్మవిశ్వాసము మానవునికి కల్గుటకు కొన్ని ప్రధానమైన సోపానములు మనం తీసుకోవాలి. 'వీతరాగభయక్రోధ....' ఈ శ్లోకములో 'రాగ, భయ, క్రోధములు మూడింటిని జయించిన వ్యక్తి మాత్రమే దివ్యత్వమును అందుకోగలడు, దివ్యత్వమును అనుభవించగలడు, దివ్యత్వములో లీనము కాగలడు,' అని చెప్పబడింది. రాగ, భయ, క్రోధములుండినంతవరకు దివ్యత్వము అర్థముకాదు. ఈ మూడింటిని నిగ్రహించిన మాత్రమున చాలదు. భగవంతునిపై అమితమైన ప్రేమ ఆవిర్భవించాలి. ప్రేమ ఆవిర్భవించినంత మాత్రమున చాలదు. ప్రేమించిన వ్యక్తిని సమీపించాలి. సమీపించినంత

srisathyasaivachanamrutam

మాత్రమున చాలదు. దానిని అనుభవించాలి. దీనినే గీతయందు 'జ్ఞాతుం, ద్రష్టుం, ప్రవేష్టుం' ఇది సరైన పద్ధతి అని చెప్పడం జరిగింది. ఒక దానిని చూడటం, చూచిన దానిని అనుభవించటం, అనుభవించినదానిలో లయము కావటం. ఈ మూడు జరిగినప్పుడే నిజమైన దివ్యత్వం అర్థమవుతుంది.

## ప్రేమించవలసినది దైవమును, భయపడవలసినది పాపమునకు

రాగమనగా తనకంటె భిన్నమైనది ఒకటున్నదనియు దాన్ని పొందినప్పుడే మనోభీష్టము నెరవేరుననియు దానిని ఏ రీతిగా పొందవలెననియు ఈ విచారణయందు మాత్రమే రాగమును మనం పెంచుకుంటున్నాం. రాగము కల్గినప్పుడు వెంటనే భయముకూడా ప్రవేశిస్తున్నాది. ఎట్లా? నేను కోరినది లభించునో లేదో, లభించినప్పటికి నేను దానిని దక్కించుకొందునో లేదో దక్కించుకునే శక్తిసామర్థ్యములు నాయందున్నవో లేదో, ఈ విధమైన భయభ్రాంతులు తక్షణమే ప్రారంభమవుతాయి. ఈ భయము కొంచెం భిన్నమైనప్పుడు క్రోధము ప్రవేశిస్తుంది. రాగ, భయ, క్రోధములు అవినాభావ సంబంధములు, అన్యోన్య ఆశ్రయములు. రాగ, భయ, క్రోధములు ఆడవారు వేసుకొనే జడవంటివి. మూడు భాగములు ఒక దానితో ఒకటి కలసి వాటిని ధరిస్తుంటారు. అదే విధముగా, రాగ భయ, క్రోధములు ఒక దానితో ఒకటి కలసి ఉన్నవి. ఈ మూడింటిని వేరు చేసినప్పుడు యిది జడయేకాదు. ఈ మూడు కలసినప్పుడే అది 'జడ' అనిపించుకుంటుంది. అలాగే మానవత్వములో యీ మూడు ఏకమై ఉంటున్నాయి. ఈ ఏకమైన తత్త్వమును ఏ రీతిగా మనం దూరం గావించుకోవాలి? ఇక్కడ భయము మనలను కృంగదీస్తుంది. నీరజ అనే గోపిక తన చెలికత్తెలను చేర్చుకుని

**భయమను దయ్యమును పారగద్రోలి భయము జయించరమ్మ**
**పాపంబున భయముండవలెనమ్మ**
**లోకముతోటి భయము మనకేలనమ్మ**
**అందరికి భయపడి దేవుని భజన చేయగలేక**
**భ్రమచెంది మరణించు సమయమందున**

srisathyasaivachanamrutam

**బలిమి మీరగ యముడు రమ్మిక రమ్మనుచు లాగంగ**
**అప్పుడు అయ్యోయ్యోయని ఏడ్వంగ నెవ్వరడ్డగింపవత్తురమ్మా!**
**భయమను దయ్యమును పారగద్రోలి నిర్భయముగనుండరమ్మా**

అని ఇతర గోపికలతో చెపుతుంది. ఇంకా "ఓ గోపికలారా! లోకులు కాకులు. లోకానికి మనం భయపడనక్కరలేదు. పాపానికి మనం భయపడాలి. దైవాన్ని మనం ప్రేమించాలి. ప్రేమించవలసింది దైవమును, భయపడవలసినది పాపమునకు," అని ప్రబోధ చేస్తుంది.

**భగవంతుని సృష్టికికూడా స్త్రీలే మూలకారణము**

ప్రకృతియందు పరమాత్మడే పురుషుడు. తాను ప్రకృతిగా మారి ప్రకృతి, పురుషుల ఏకత్వము చేర్చుకొని తద్వారా సృష్టిని జరుపుతూ వస్తున్నాడు. మనం లోకంకోసం భయపడనక్కరలేదు. కాకులు కూస్తున్నాయని కోకిల తన గానము మానుకుంటుందా? ఈ కాకులవంటి ప్రజలు కూస్తున్నారని మనం భగవంతుని ప్రేమ మానుకుంటామా? కనుక "గోపికలారా! మనమెవ్వరము లోకానికి భయపడనక్కరలేదు. మనము చేసేది పాపము కాదు. మనము రాజమార్గములో ప్రవేశిస్తున్నాము. ఆశించేది భగవంతుని. అతని అండదండలనే మనం ఆశిస్తున్నాము. అతని ఆనందాన్నే మనం ఆశిస్తున్నాము. అతని ఐక్యతనే మనం ఆశిస్తున్నాము," అని వారికి బోధపరుస్తుంది.

**పరమేశ్వరుడే యిట్లు తరుణియై పురుషుడై**
**ధర క్రీడించుచుండగ**
**నిజముగా జూడ తరుణి జన్మమే ఘనముగా**
**గర్భధారణ వహియింపవలెనుగా**
**నవమాసములు మోసి కనిపెంచి**
**ఘనబుద్ధులను నేర్పి తనయుని**
**ఒసగెడి తల్లి తక్కువయగునా!**
**కనుకనే తల్లిదండ్రులందు వెనుకనుంచిరి తండ్రిపేరు**
**కలదు అన్నింటికి తరుణి నామమె ముందు**



sri sathyasai vahini amrutam

స్త్రీకి సాత్త్వికమే ప్రధానమైనది. 'స్త్రీ' అనే పదము సకార రకార తకారములతో కూడినది. స-సాత్త్విక గుణము స్త్రీ. 'త'-సిగ్గు, బిడియము యిలాంటివి ఉండేవి. 'త' అనగా కట్టకడపటికి ఏదైనా త్యాగము చేసే గుణము. 'ర' రజోగుణము-స్త్రీలు కేవలము అబలలు కాదు. తరుణి జన్మము చాలా ఘనమైనది. మన దేశమును మాతృదేశమంటున్నారు, పితృదేశమని చెప్పటం లేదు. మొట్టమొదట తల్లి అంటారు. ఏదైనా ఆపద కల్గి క్రిందపడితే 'అమ్మా!' అంటారు గానీ, 'అప్పా!' అనరు. ఈ స్త్రీ జాతి దైవాన్నికూడను సృష్టిస్తున్నాది. కౌసల్య లేక రాముడు పుట్టాడా? దేవకీదేవి లేకపోతే కృష్ణుడు పుట్టాడా? భగవంతుని సృష్టికికూడా స్త్రీలే మూలకారణము.

**గోపికలు ప్రేమతత్త్వంచేత పరతత్త్వమును స్వాధీనము చేసుకోగలిగారు**

ఈనాడు భక్తుడు భగవంతుని సృష్టిస్తున్నాడు. భగవంతుడు భక్తుని సృష్టిస్తున్నాడు. దేవునికి ఏ శక్తి ఉన్నదో భక్తునికి ఆ సృష్టి శక్తి ఉన్నది. భగవంతుని సృష్టించేవారు ఎవరు లేరు. కానీ భక్తుడు మాత్రం భగవంతుని సృష్టిస్తాడు. ఆ భక్తిప్రపత్తులచేత అనంతశక్తివంతమైన భగవంతునికూడను సాక్షాత్కరింప చేసుకుంటాడు. దీనికి రెండు మార్గములున్నాయి. ఒకటి అనురాగము, రెండవది ప్రేమ. ప్రపంచమునందుండిన సమస్త సంబంధములు అనురాగమునకు చెందినవేగానీ ప్రేమకు చెందినవి కాదు. అనురాగము అనగా పదార్థముల వాంఛలవల్ల సంబంధముగా ఏర్పరుచుకున్నాము. రాగముచేత ఏర్పడినది కనుక దీనిని అనురాగమన్నారు. కానీ, అది ప్రేమకాదు. భర్తను భార్య ప్రేమిస్తున్నాదంటే స్వార్థంకోసం ప్రేమిస్తున్నాది. భార్యను భర్త ప్రేమిస్తున్నాడంటే తనయొక్క స్వార్థంకోసం ప్రేమిస్తున్నాడు. బిడ్డను తల్లి ప్రేమిస్తున్నాదంటే తల్లి స్వార్థంకోసం ప్రేమిస్తున్నాది. అన్నింటియందు అంతో యింతో స్వార్థము ఉంటున్నాది. ఇది రాగముతో కూడినది. కనుకనే యిదంతా 'అనురాగము' అన్నారు. ఏ విధమైన పరిస్థితియందైన, అన్ని రకముల సంబంధములందు అనురాగమే పరిపూర్ణముగా ఉన్నది గానీ ప్రేమతత్త్వము లేదు. ఈ ప్రేమ అనేది ఒక్క భగవంతునిపై మాత్రమే ప్రసరింపచేయాలి. ఇందులో స్వార్థము శూన్యము. పరార్థము సత్యము.

srisathyasaivachanamrutam

ప్రేమను అన్ని విషయములందు ప్రవేశపెడుతున్నాము. కనుక, 'ప్రేమ' అనే రెండక్షరములకు విలువలేకుండా పోతున్నాది. ఈ ప్రేమ ఒక్క దైవముపైన మాత్రమే ప్రసరించటానికిగానీ, మిగిలినదంతా అనురాగమే! అట్టి ప్రేమకై ప్రాకులాడిన వ్యక్తులు గోపికలు. ఈ ప్రేమతత్త్వముచేత పరతత్త్వాన్ని స్వాధీనము చేసుకోగలిగారు. ఎలాంటి పరిస్థితులందైనా, వస్తువుయొక్క విచారణకు వారు ఏమాత్రము పాల్పడేవారు కాదు. వారందరు ఒక్కచోట చేరి ఈ ప్రేమతత్త్వాన్ని చింతించుతున్న సమయములోపల కృష్ణుడు ప్రత్యక్షమయ్యాడు.

**భగవంతుని చూడగలిగినవి జ్ఞానచక్షువులేగాని చర్మచక్షువులు కాదు**

ఆ ప్రత్యక్షమైన కృష్ణానందమును అనుభవిస్తూ ఒక్కతూరి తమ కన్నులు మూసుకున్నారు. ఈనాడు ప్రపంచములో దేవాలయమునకు దేవుని చూడాలని వెడతారు. దేవాలయమునకు వెళ్లి దేవుని దగ్గరకు పోతూనే కళ్ళు మూసుకొని నమస్కారము చేస్తారు. దేవుని చూడాలని పోయినవారు కండ్లు ఎందుకు మూసుకోవాలి? దీనియొక్క అంతరార్థము ఏమిటి? "ఓ దైవమా! నీ కల్పితమైన రూపాన్ని ఈ కన్నులు చూస్తున్నాయి. కానీ, నిజంగా నిన్ను చూడగలిగిన కన్నులు చర్మ చక్షువులు కాదు, జ్ఞాన చక్షువులు. అందువలన నా కన్నులు మూసుకొని నా జ్ఞాన చక్షువులతో చూస్తాను" అని అంతరార్థము. వారు కన్నులు మూసుకొనేటప్పటికి కృష్ణుడు అంతర్ధానమైపోయాడు. గోపికలు చెల్లా చెదరై ఎటుచూచినా పరుగెత్తుతున్నారు. అడవులకు పోయినారు, వనమునకు పోయినారు, బృందావనములో ప్రవేశించారు. ఒక చెట్టును పట్టుకొని దాన్ని అడుగుతున్నారు, 'మా కృష్ణుడు ఎక్కడ?' అని. ఒక పొదను పట్టుకున్నారు. 'ఎక్కడ పోయాడు మా కృష్ణుడు, నీకు తెలుసునా?' అని. అనగా ఏమిటి? సర్వమునందు భగవంతుడున్నాడనే ప్రేమ భావము వారిలో నిండిపోయింది. పుష్పాన్ని పట్టుకున్నారు.

**నల్లనివాడు పద్మనయంబులవాడు కృపారసంబు పై**
**జల్లెడువాడు మౌళిపరిసర్పిత పింఛమువాడు నవ్వురా**
**జిల్లెడు మొమువాడొకడు చెల్వల మానధనంబు దోచెనో**
**మల్లియలార! మీ పొదల మాటున లేడుగదమ్మ చెప్పరే!**

srisathyasaivachanamrutam

మొక్క ఏమైనా చెప్పగలదా! పుష్పములేమైనా చెప్పగలవా! వాటికి విజ్ఞానమనేదే లేదు. కాని, అవికూడా జీవముతో కూడినవే! సర్వము భగవన్మయముగా వారు భావిస్తూ, ప్రేమిస్తూ వచ్చారు. ఒకదానికొకటి సన్నిహిత సంబంధ బాంధవ్యములు ఎట్లా ఉన్నాయనగా భగవంతునియొక్క ప్రేమతత్త్వాన్ని అనుభవించినవారికి మరొక ప్రేమ ఏమాత్రము గిట్టదు. చకోర పక్షులు చంద్రుని మాత్రమే వెతుకుతూ పోతాయిగానీ దానికంటె పెద్ద లైటు పెట్టినా అది చంద్రుడని భ్రమించవు. అదే విధంగా "ఈ కల్పితమైన వాటినంతా మేము ప్రేమించము. నిన్ను మాత్రమే ప్రేమిస్తాము. కనుక ఓ పరమాత్మా! మా ప్రేమ చాలా పవిత్రమైనది. మరొక వాంఛలు ఏమాత్రములేవు. ప్రేమ నిమిత్తమై నిన్ను మేము ప్రేమిస్తున్నాము," అని విన్నవించుకున్నారు.

**భక్తుల హృదయాలను మథించి, శోధించి, ప్రేమతత్త్వమును తీసుకోటమే కృష్ణుడు వెన్న దొంగిలించుటలో గల అంతరార్థము**

ఈనాడు పిల్లలందరు కృష్ణుని గురించి కొంత చెప్పమన్నారు. కృష్ణుడు వెన్నను దొంగిలించుటలోనున్న అంతరార్థము ఏమిటి? వెన్న అనగా హృదయాన్నంతా మథించి, శోధించి, పరిశోధించి తీసుకున్న పవిత్రమైన ప్రేమతత్త్వమే! అది పరిశుద్ధమైనది. అట్టి పరిశుద్ధమైన వెన్నను దొంగిలించాడంటే హృదయములు మాత్రమే అపహరిస్తూ వచ్చాడు, అన్నమాట.

గోపికలు అనేక విధములుగా యశోదకు కంప్లైంట్సు చేస్తూ వచ్చారు. కృష్ణుని చేతబట్టింది, యశోద.

**కృష్ణా! పెట్టినది తినవు**
**గొల్లల పట్టులకుంబోయి వెన్న పట్టెడులుగ లో**
**గుట్టున తినెదవు నీతో**
**పుట్టెను రట్టళ్లు కృష్ణా! పొమ్ము కుమారా!**

'ఏరికోరి యీ గలాటాలంతా నీవు ప్రారంభము చేస్తున్నావు. గోకులమంతా నీపై చాలా క్రోధంగా ఉంటున్నారు. నీవు నేను పెడితే ఎందుకు తినవు? ఇతరుల యింట వెన్న నీకు



srisathyasaivachanamrutam

అంత రుచియా?' దీని అంతరార్థమేమనగా భగవంతునికి హృదయము చాలా మధురమైనది.

## జ్ఞానముకంటె భక్తి గొప్పది

ఒకానొక సమయములో గోపికల హృదయతత్వాన్ని తలచుకుంటూ, ఆనందించుకుంటూ, నవ్వుకుంటూ వెడుతున్నాడు యమునాతీరమందు శ్రీకృష్ణుడు. ఆ సమయమునందే రాధ యమునాతీరమునుండి నీరు తీసుకుపోతున్నది. ఒక్కతూరి రాధను చూచి ఫక్కున నవ్వాడు, కృష్ణుడు. నవ్వేటప్పటికి కృష్ణుని ఆనందము బైటపడింది. ఒక జ్యోతి మాదిరి వెలిగింది. ఆ దివ్యకాంతి పోతూ పోతూ రాధలో చేరిపోయింది. ఆనాటినుండి రాధకు 'ఆహ్లాదిని' అని పేరు. కృష్ణునియొక్క ఆహ్లాదమును మ్రింగినది కనుక ఆమెకు 'ఆహ్లాదిని' అని పేరు. కనుక, నాటిమొదలు నేటివరకు కృష్ణుడు నా ఆనందము నాకివ్వమని రాధ వెనుక తిరుగుతుంటాడు. ఎక్కడ కృష్ణుడో, అక్కడ రాధ. ఎక్కడ రాధో, అక్కడ కృష్ణుడు. కనుక, రాధ, కృష్ణుడు. రాధ మొదటిది కృష్ణుడు రెండవవాడు. అదేవిధముగా, సీతారాములు. సీతమొదలు, రాముడు వెనుక. లక్ష్మీనారాయణ, లక్ష్మిమొదలు నారాయణుడు వెనుక. పార్వతీపరమేశ్వరులు. పార్వతి మొదలు, పరమేశ్వరుడు వెనుక. అన్నింటియందు స్త్రీలకు ప్రధానమైన స్థానమున్నది. కారణమేమనగా భగవంతుని భక్తిప్రపత్తులకు స్త్రీలే ప్రధాన మార్గదర్శకులు. ఒక్కొక్క సమయమందు వారు బాహ్యమైన దానిని మాత్రమే ఆశిస్తారు. బాహ్యంగా భర్త భగవంతుని చింత చేయకపోతే భార్యకు చాలా కష్టమవుతుంది. అసలు భర్తలను భగవన్మార్గమునకు తీసుకువచ్చేది మొట్టమొదట భార్యలే! వారే గైడ్సు. స్త్రీకి 'భక్తి' అని పేరు. పురుషునకు 'జ్ఞానము' అని పేరు. పురుషుడనే జ్ఞాని భగవంతుని మందిర సింహద్వారమువరకు మాత్రమే పోగలడు. అతడు దర్బారు హాలులో మాత్రమే ప్రవేశించగలడు. పురుషులకు అంతఃపురములో ప్రవేశించుటకు అధికారములేదు. జ్ఞానము దేవుని దర్బారువరకు మాత్రమే ప్రవేశించవచ్చు. భక్తి అనే స్త్రీ స్వేచ్ఛగా అంతఃపురమంతా చుట్టుకొన్ని రావచ్చు. స్త్రీకి భక్తి అని పేరు. భక్తిచేత సర్వము పొందవచ్చునుగానీ జ్ఞానముచేత కొంతవరకే! జ్ఞానముకంటే భక్తి గొప్పది. ఎంతమందో జ్ఞానులుంటున్నారు; కానీ, జ్ఞానులు భగవంతుని చేరలేరు. భక్తి ప్రపత్తులతో



srisathyasaivachanamrutam

మాత్రమే భగవంతుని చేరగలరు. అట్లు చేరినవారు ఎంతమందో ఉంటున్నారు. తులసిదాస్, రామదాసు, సూరదాసు, కబీర్‌దాసు అందరూ ఇటువంటివారే! వేదశాస్త్రపురాణ యితిహాసములనుండి జ్ఞానమును ఆర్జించిన ఏ గొప్పవారైనా భగవంతుని చేరినవారు ఒక్కరైనా చరిత్రయందు కానరారు. ఇది ఎట్లనగా కేవలము జ్ఞానముయొక్క తత్త్వాన్ని మాత్రమే ఒక కిరీటముగా ధరించి తద్వారా దైవత్వముయొక్క విలువ గుర్తించుకోలేకపోతున్నారు. జ్ఞానముయొక్క విలువను తెలుసుకోటానికి మాత్రమే ప్రయత్నిస్తున్నారుగానీ, దైవముయొక్క విలువ తెలుసుకోటానికి ప్రయత్నించటంలేదు.

**భక్తిలేక ఎంత జ్ఞానముండి ప్రయోజనము లేదు**

ఒక చిన్న ఉదాహరణము. గోకులంలోపల గోపాలురందరు చేరి గోవులతో బాటు గొఱ్ఱెలను, మేకలను తీసుకుపోయేవారు. అప్పుడు పెద్దవర్షం కురిసింది, గోవర్ధనగిరిపైన. గోవర్ధనగిరినుండి వంకలు పారుతూ పోయిన తర్వాత బాగా మెరుస్తున్న ఒక రాయి కనిపించింది, ఒక గోపాలునికి. ఇది చాలా బాగుంటున్నాది. నల్లని మేక మెడకు కడితే అందంగా ఉంటుందని అతడు ఆశించాడు. తాను కోరలేదు. నా మేకపిల్లకు కడితే ఎంత బాగా కనిపిస్తుందని ఆ జీవిపైనున్న ప్రేమ తను ప్రదర్శిస్తూ వచ్చాడు. దీనిని కట్టినప్పుడు ఒకానొక దినము కృష్ణుడుకూడా దీనిని చూడవచ్చును అని ఆ రాతికి చక్కగా దారం కట్టి తీసుకుని వెళ్లి మేకమెడకు పెట్టాడు. ఒకనాడు ఎండ అధికంగా ఉండటంచేత వృక్షముక్రింద కూర్చుని మేకలను మేపుతూ వచ్చాడు. విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ మార్గమునందే ఒక రత్నాల వర్తకుడు ప్రయాణమైపోతూ తానుకూడా ఆ వృక్షచ్ఛాయలో విశ్రాంతికోసం కూర్చున్నాడు. ఆ సమయంలో గోపాలుడు మేకపిల్లను తన ఒడిలో కూర్చోపెట్టుకొని 'అందమె ఆనందం ఆనందమె జీవిత మకరందం' అని పాడుతూ నీవు ఎంత అందముగా ఉంటున్నావు అని దాన్ని నిమురుతున్నాడు. చూచాడు, ఆ వజ్రాల వర్తకుడు. 'ఏమిటి ఈ రాయి?' అని పరికించి చూచాడు. రాయి లక్షలకు విలువైనది అనుకున్నాడు. 'అబ్బాయి! ఈ రాయి దీనికి ఎందుకు కట్టావు?' అని పశువుల కాపరిని ప్రశ్నించాడు. 'ఈ రాయి మెరుస్తుంటే దాని కాంతితో నా మేక చాలా అందంగా ఉంటున్నాది. చాలా ప్రకాశంగా

ఉంటున్నాది. నల్లని రంగుగల మేక చాలా అందంగా కనుపిస్తున్నాది' అని చెప్పాడు. 'ఈ రాయి ఎందుకు కట్టావు? యింకా మంచిది ఏదైనా కట్టవచ్చును కదా! పది రూపాయలు యిస్తాను తీసుకుపోయి ఆ రాయి నాకు యియ్యి' అన్నాడు, వర్తకుడు. ఆ అబ్బాయి పదిరూపాయలు తీసుకున్నాడు, పాపం. వజ్రము విలువ తనకు తెలియదు. అందము ఆనందముయొక్క విలువనే చూస్తూ వచ్చాడు. ఈ వర్తకునికి ఆ వజ్రముయొక్క విలువ చాలా బాగా తెలుసు. 'ఆహా! ఈనాడు చాలా మంచి ముహూర్తము. లక్షల విలువైన వజ్రము నాకు సులభంగా చిక్కింది,' అని చేతిలో పట్టుకొని 'ఎంత విలువైనది' అనుకున్నాడు. అలా అనుకుంటూ ఉండగనే ఆ వజ్రము పగిలిపోయింది. ఎందుకోసం యిది జరిగిందని ఆతడు చాలా విచారించాడు. ఇంతలో ఈ వజ్రము అశరీరవాణిగా చెప్పింది: 'ఓ వర్తకుడా! కేవలము సర్వభూతదయ, ప్రేమలను అనుభవించే అమాయకుడైన ఈ గొల్లపిల్లవానిదగ్గర వున్న వజ్రము కాజేయాలని చూశావు. నా యొక్క విలువ తెలియకుండా కేవలము నా అందమును మాత్రమే వాడు చూస్తూ వచ్చాడు. అలాంటి అమాయకుని మోసగించి నా విలువ తెలిసినప్పటికి అంత విలువ యివ్వకుండా కేవలము నన్నుకూడా మోసం చేశావు. కనుకనే నా గుండె పగిలిపోయింది. విలువ తెలిసినవాడుకూడా విలువ యివ్వకుండా పోతున్నాడు. శాస్త్రజ్ఞానముతో విలువ తెలుసుకున్నవాడవు నీవు. కానీ, ఆ జ్ఞానము విలువ నాకు యివ్వటంలేదు. కేవలము ఈ జ్ఞానమంతా ప్రాకృతవిద్యగా ఉపయోగపరుస్తున్నావు. జ్ఞానము తెలియకపోయినా అమాయకుడైన గొల్లపిల్లవాడు ఆనందమునకు విలువ యిచ్చాడు. అది భక్తి, ఇది జ్ఞానం. జ్ఞానము భక్తికంటె తక్కువదేగానీ, అధికమైనదికాదు. భక్తిలేక ఎంత జ్ఞానము ఉండి ప్రయోజనం లేదు,' అని చెప్పింది.

**గోపికలు జీవబ్రహ్మైక్యానుసంధానమునకు నిదర్శనములేగాని వేరు కాదు**

గోపికల భక్తి భావములు ఎంత పవిత్రమైనవో చిన్న ఉదాహరణలో చెప్పవచ్చును. ఉద్ధవుడు కృష్ణునినుండి వార్త తీసుకువచ్చాడు. "ఓ గోపికలారా! కృష్ణునియొక్క వార్తను మీకు అందించేకోసం వచ్చాను. అందరు యశోద ఇంటికి రండి" అని చెప్పాడు. సరే కృష్ణుడు ఏమి సందేశము పంపించాడో అని అందరు పరుగెత్తి వచ్చారు. ఒక్కరైనా

ఉద్ధవుని చూడలేదు. ఎందువలన? 'పరపురుషుని మేము చూడము. కృష్ణుని చూచిన నేత్రములతో మరొక పురుషుని మేము చూడము' అని అందరు పైకి చూస్తున్నారు. పైకి చూస్తున్న సమయంలో నల్లని తుమ్మెద ఝుఝున వచ్చేసింది. గోపికలు చెప్పారు, 'దొంగ వస్తున్నాడు. కృష్ణుడు ఈ రూపాన్ని ధరించాడు. ఆ కృష్ణుని గుణములన్నీ దీనికికూడా ఉన్నాయి,' అని. కృష్ణుడు నల్లనివాడు. గోపికల హృదయకమలములలో ప్రవేశించి వారియొక్క భావముల రెక్కలను చిదిరింపచేసి ఆ కమలములందున్న మకరందము దొంగిలించి నిర్దాక్షిణ్యముగా వెళ్లి పోయాడు, మధురకు. ఈ తుమ్మెదకూడా అంతే! పువ్వులలో ప్రవేశిస్తుంది, పూలలోని మకరందమును గ్రోలుతున్నాది. రెక్కలను రాల్చి వేస్తున్నాది. నిర్దాక్షిణ్యముగా వెళ్లిపోతున్నాది. కృష్ణుని గుణములు దీనికికూడా ఉన్నాయి. కనుక యిది కృష్ణునియొక్క ప్రతిబింబమేను, అని దానిని దృష్టియందుంచుకొని ఉద్ధవుని చూడలేదు. 'ఓ భ్రమరమా! ఏమిటి నీవు సందేశం పంపిచావు మాకు?' అని అడిగారు. ఉద్ధవుడు చెబుతున్నాడు, 'అమ్మాయిలూ చూడండి, ఈ కాగితము చూడండి' అన్నాడు. ఒక గోపిక చెప్పింది. 'అయ్యో! మేము పాతకాలములో ఉండినవారము. మేము చదవలేదు. మాకు చదువులు రావు. మా తల్లితండ్రులు బయటకు పంపేవారు కారు. మాకు చదువురాదు. ఓ భ్రమరమా! నీవే చదువు' అని చెప్పింది. ఉద్ధవుని పేరు చెప్పటంలేదు. భ్రమరం పేరు చెబుతున్నది. అప్పుడు మరొక గోపిక చెప్పింది, 'నాకు అంతోయింతో చదువువచ్చు. కానీ భ్రమరమా! ఆ కృష్ణుని సుందరమైన అక్షరాలు చూచిన తక్షణమే నాకు కంటిధారలు కారవచ్చు. ఆ కంటిధారలు ఈ కాగితముపై పడి అక్షరములు చెదిరిపోవచ్చును. కనుక ఆ జాబును నేను చూడను' అని. యింకొక గోపిక చెప్పింది, 'ఓ భ్రమరమా! కృష్ణ వియోగాగ్నితో లోపల మా దేహమంతా మండిపోతున్నాది. మా దేహమంతా అగ్నిమయంగా ఉంటున్నాది. ఆ కాగితము మేము చేతిలో పట్టుకుంటే అది కాలిపోతుందో ఏమో! కనుక ఆ సందేశము మేము చదవము. మాకు కావలసినది కృష్ణుడే! సందేశముతో తృప్తిపడే స్వభావము కాదు, మాకు. తానే వచ్చి స్వయంగా మాతో మాట్లాడాలి.' అని చెప్పి భ్రమరముతో సందేశము పంపుతున్నారు, వీరుకూడా.

**తుమ్మెదా! ఒకసారి కన్నెత్తి చూడమని చెప్పవే నా మాట శ్రీకృష్ణునకు**

మరొక గోపిక

**రమ్మనవె తుమ్మెద మాచెంత వ్రాలమని దివ్యమైన ప్రేమ చేకూర్చమనవె**

యింకొక గోపిక

**మబ్బు గ్రమ్మిన నాదు మానస వీధిలో కృష్ణభానుని తేజము నిలుపమనుము**

యింకొక గోపిక

**ఎండబారిన నాదు జీవిత వృక్షము చిగురు పెట్టగ వేగ చేయమనవె**

మా జీవిత వృక్షములు ఎండబారిపోయాయి-చిగురు పెట్టాలి. రాధ వచ్చింది.

**చెదరిపోయిన నాదు జీవిత సుమమాల చెల్వారగూర్చి ధరియించమనవె**

అదే భ్రమర గీతము అని పేరు. భ్రమరంచేత ఈ సందేశము పంపించారు. కృష్ణుని వదలి ఒక్క క్షణము మేము ఉండలేము. హే కృష్ణా!

**పుష్పంబువై నీవు పొలుపొందుచుండిన**
**తుమ్మెదలమై మేము తిరుగుచుందు**
**వృక్షంబువై నీవు వర్ధిల్లుచుండిన**
**వల్లికనై మేము అల్లుకొందు**

నిన్ను వదలి క్షణము ఉండము. నిన్ను చుట్టుకొనే ఉంటాము.

**మేరు పర్వతమే నీవైన పరచుకొని పారెద**
**సెలయేరునై**
**అనంత ఆకాశమే నీవైన చిన్న చుక్కనై**
**నీలో చెలగుచుందు**

ఇలాంటి భావాలతో వారు ఉండేవారు. అది ఇది, ఏ కోరికలు వారికి లేవు. కానీ,

srisathyasaivachanamrutam

రాసక్రీడలను గురించి 'పండితులు' చేసిన వ్యాఖ్యానమువలన అపఖ్యాతులు బయలుదేరుతున్నాయి. జీవబ్రహ్మ ఐక్యానుసంధానమేగానీ భాగవతము మరొకటి కాదు. గోపికలు లౌకికమైన భావములతోనున్నవారు కాదు. ఏ విధమైన తత్వములో రెండు పదార్థములు ఏకమౌతాయో అదియే దివ్యమైన సన్నిధి అని, పెన్నిధి అని సాయుజ్యమని బోధిస్తూ వచ్చారు.

ఇంకా కొన్ని సూక్ష్మమైన పలుకులలో దైవత్వాన్ని నిరూపిస్తూ వచ్చాడు కృష్ణుడు. గోపికలంతా వచ్చారు యశోద దగ్గరకు, ఫిర్యాదు చేయడానికి:

**గొల్లభామలంతగూడి చల్లనమ్మను బోవుచుండగ**
**సుంకమిమ్మని చిల్లులు పడగొట్టినాడు కుండలకు**
**అడుగవే తల్లి, అడుగవే!**

అప్పుడు యశోద కృష్ణుని పట్టుకుని

**గొల్లభామలంతగూడి చల్లనమ్మను బోవుచుండ**
**సుంకమిమ్మని చిల్లులు పడగొట్టినావట**
**కృష్ణా! తుంటరితనము మానుమా కృష్ణా!**

అందుకు కృష్ణుడు సమాధానమిస్తూ

**దేవుడేమో కొట్టిపోతే తెలియక నాపై వేచిరి**
**ఇందు నా దోసమేమి చెప్పవే తల్లీ! చెప్పవే!**

అనగా 'తానే దేవుడు' అని, ఇంత సూక్ష్మముగా చెప్పాడు. అంతా తానే! దేవుడూ తానే!

ప్రతిదానియందు చిన్న చిన్న విషయములందుకూడా ఎంతో దైవత్వము నిరూపిస్తూ వచ్చింది, భాగవతము. గోపికలుగానీ, గోపాలురుగానీ, కేవలం ప్రాకృత భావములతో చేరినవారు కాదు. దివ్యమైన భావముతో కూడినవారు. ఆ దివ్యత్వము వారిలో తరతరములనుండి ఆవిర్భవిస్తున్నది. అదే నిజమైన ప్రేమ. ఫలము ఆశించని ప్రేమయే ప్రేమ. ఏదో ఫలనిమిత్తమై ప్రేమిస్తే అది నిజమైన ప్రేమకాదు. భాగవతం అంతా



srisathyasaivachanamrutam

ప్రేమతోకూడినదేగానీ, అనురాగం కాదు. మానవత్వంలో ప్రేమ అనేది ఉన్నది. ఆ ప్రేమ పరిపరివిధములుగా ప్రవహింపచేసి మాలిన్యం చేస్తుంటారు. కనుక, ప్రేమను పరమాత్మపై ప్రసరింప చేయాలి.

ప్రేమకు 3 గుణములుంటున్నాయి. త్రికోణములతో కూడినది. ప్రేమకు భయములేదు. ఆశలేదు. తత్ఫలితమును కోరదు. అదే ప్రేమతత్త్వం. ప్రేమకు ఎట్టి భయములేదు. ఏ ఫలముకోరదు. యింతేకాక, దివ్యత్వముతో నిండి ఉంటుంది. ప్రతిఫలాపేక్షలేని ప్రేమ. గోపికలు ఏ కోరికలు కోరలేదు. కోరింది కృష్ణుని మాత్రమే! దైవము మాత్రమే మాకు కావాలి. మిగిలినవి ఏవీ మాకు అక్కరలేదు. రాధకు అంత్య సమయం ప్రారంభమైంది. అంత్యసమయంలో యమునానదికి బయలుదేరింది. ఒకే బాధ. ఒక్క నిమిషమైనా ఈ అవకాశము ప్రసాదించవా? నేను ఎవరికోసం బ్రతుకుతున్నాను. నీ కోసమే.

**నిలువ నీడలేని బ్రతుకు నీకొరకని మోయుదాన కృష్ణా!**
**నిలువదురా నా మనసు నీ నగవులు దూరమైన**
**కలలోనైన కనులకు కానగరావా కృష్ణా!**
**నిన్ను విడచి నిలువ లేనురా కానగరారా కృష్ణా!**
**కనుపాపవు మాటకు పసిపాపవు మనసుకు**
**నిను విడచి అరనిముషము నిలువగలేరా కృష్ణా!**

"నీవు కనుబడటమే నాకు చాలు. ఏమీ నాకు అక్కరలేదు. ఒక్కతూరి నీవు కనుపిస్తే చాలు. నా జీవితము నిలువ నీడలేని బ్రతుకు. నీవే నా నీడవు," అని ఆక్రోశించింది. ఈ విధమైన కోరికలతో వారు జీవితాన్ని గడుపుతూ వచ్చారు.

**గోపికలు దివ్యమైన, అంతరార్థములతో కూడిన ప్రార్థనలు చేస్తూ వచ్చారు**

ఈనాడు భగవంతుని ప్రార్థన అనంతమైన కోరికలతో నిండి ఉంటుంది. ఇది అనురాగమే కానీ, ప్రేమకాదు. ప్రేమ అనగా ఒక్కటే మార్గము, రెండవది లేదు. Heart to heart, love to love. పదార్థములకు, విషయములకు సంబంధించినది కాదు. గోపికలు, గోపాలురు కృష్ణతత్త్వముతప్ప అన్య తత్త్వము వారు ఏమాత్రము ఆశించేవారు కాదు. కృష్ణుని

పట్టి రోటికి కట్టి కఱ్ఱతో కొట్టాలని యశోద ఎంతో ప్రయత్నించింది. కృష్ణుడు పరిగెత్తుతున్నాడు. గోపికలు "కృష్ణా! కృష్ణా! ఎక్కడికి పోయినా నిన్ను పట్టేస్తుంది తల్లి. తల్లికి కనిపించకుండా ఉండే స్థలము ఒకటి ఉంటున్నాది. అది మాకు తెలుసు. అక్కడకు వచ్చి నీవు దాగు. ఏ తల్లీ నిన్ను పట్టలేదు. ఏది ఆ స్థలము, తెలుసునా? మా హృదయము. మా హృదయములో అంధకారము ఉంటున్నాది. నీవుకూడా (చీకటివాడవే) నలుపే. కాబట్టి చీకటి హృదయంలో నల్లని కృష్ణుడు దాగుకుంటే తల్లికి కనిపించవు. మాకు ఆనందము. నీకు దెబ్బలూ తప్పుతాయి. ఇద్దరికీ ఆనందము కల్గుతుంది. కృష్ణా! తక్షణమే రా, మా హృదయములో ప్రవేశించు," అని వేడుకున్నారు. ఈ విధమైన భావాలతో కృష్ణుని కోరేవారు.

ఒకతూరి కాళింగ మర్దన జరుగుతున్నాది. గోపికలు వచ్చారు. "కృష్ణా! నీవు కాళింగమర్దన చేశావు. ఎక్కడ? కాళింగ మడుగులో కాదు. మా హృదయమనే మానస సరోవరములో విషయ వాసనలనే కాళింగుడు జీవిస్తున్నాడు. అందుపైన నీవు తాండవమాడుతున్నావు. అయితే మాకు కనిపించటం లేదు. కాళింది నలుపు. విషము నలుపు. నీవు నలుపు. ఆకాశము నలుపుగా ఉంది. కృష్ణా! మా మానస సరోవర మాలిన్యమును శుభ్రము చేయమని మేము నిన్ను కోరము. నీ సుందర రూపాన్ని తెల్లగా మార్చుకోమని కోరం. కాళింది మడుగును పరిశుద్ధము చేయమని కోరము. అయితే దాని వెనుకనున్న ఆకాశమును తెల్లగా మార్చు. తెల్లని ఆకాశము తెరగా ఉండినప్పుడు నీ నల్లని రూపం చక్కగా కనిపిస్తుంది. మా హృదయము తెల్లగా మార్చు. అప్పుడు నీ సుందరరూపము మా మానస సరోవరంలో చక్కగా కనిపిస్తుంది." అని ప్రార్థించారు. గోపికలు ఈ విధమైన అంతరార్థములతో కూడిన భావములను ఆశిస్తూ వచ్చారు. ప్రతిదానిలో స్వార్థము వారికేమాత్రము లేదు. కృష్ణుడు తప్ప అన్యము లేదు.

ఈ విధంగా చెబుతూపోతే భాగవతం, కొన్ని సంవత్సరములైనా చాలదు. చాలామంది భాగవతముయొక్క తత్త్వాన్ని సరిగా అర్థము చేసుకోలేదు. భాగవతమును అర్థము చేసుకోవాలంటే భక్తుని హృదయము పరిశుద్ధముగా ఉండడం చాలా అవసరం. భక్తి

sri sathyasai vahanamrutam

ప్రధానమైన తత్త్వము. ఆ భక్తికి మించినది మరొకటి లేనే లేదు. జ్ఞానముకంటె అధికమైనది భక్తి. భక్తిలేక జ్ఞానముండి ప్రయోజనం ఏమిటి? ఎంతజ్ఞానమున్నా భగవంతుని వర్ణించగలరేగానీ భక్తిలేక అనుభవించలేరు. వ్యాసుడు గొప్ప జ్ఞానము కల్గినవాడు. అంతజ్ఞానముకల్గిన వ్యాసునికి అశాంతి ప్రారంభమైంది. కనుక, ఆనాడు భాగవతము వ్రాసి భక్తిని అభివృద్ధిపరచుకుంటూ వచ్చాడు.

### మమత్వమే వ్యత్యాసము, ప్రేమయే సమత్వము

ఈనాటి లోకములో అభిమానము, మమకారము ఉంటున్నాయి. చిన్న ఉదాహరణము. ఒకడు కోడిని పెంచుకుంటూ వచ్చాడు. పిల్లినికూడా పెంచుతూ వచ్చాడు. ఒకనాడు వాడు పెంచిన పిల్లి కోడిపెట్టను తినేసింది. ఆనాడు పిల్లిని తరుముతూ తరుముతూ కొడుతున్నాడు. 'కోడిపెట్టను చంపావు, చాలా విలువైన దానిని,' అని ఆ పిల్లిని కొడుతున్నాడు. అదే పిల్లి రెండవదినము ఎలుకను పట్టి చంపింది, అదే యింట్లో. 'పిల్లి చాలా మంచి పని చేసింది' అని సంతోషపడిపోతున్నాడు. అనగా తనకు అయిష్టమైన దానిని చంపినప్పుడు సంతోషిస్తున్నాడు. యిష్టమైన కోడిపెట్టను చంపినప్పుడు తాను విచారిస్తున్నాడు. ఈ రెండింటికి ఉండిన వ్యత్యాసము ఏమిటి? మమత్వమే వ్యత్యాసము. మమత్వముతో చేరినది సమత్వము కాదు. ప్రేమయే సమత్వము. పిల్లిలోను, ఎలుకలోను, కోడిలోను ఉండిన దివ్యత్వము ఒక్కటే! ఈ భావాన్ని గోపికలు ఆనందముగా అనుభవిస్తూ వచ్చారు. 'ఏకంసత్ విప్రాః బహుధా వదంతి'. ఒక్కొక్కరు ఒక్కొక్క రకమైన పేరుతో చెప్పవచ్చు. ఉన్నది ఒక్కటే! ఈ సత్యాన్ని వారు చాటుతూ వచ్చారు. రాధకు దర్శనం యిచ్చాడు, వేణువును ఊదాడు. ఆమెకు తృప్తినందించి వేణువును ఆనాటినుండి వదలి పెట్టాడు.

**(తేదీ 29-04-1992న కొడైకెనాల్ సాయి శ్రుతిలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam